

# భావదారిద్ర్యం

ఒక గొప్ప రచయిత 'ఫిలాసఫీ ఆఫ్ పావర్టీ' అని రచన చేసి ఖ్యాతి గాంచాడు. అది చదివిన ప్రత్యర్థి రచయిత 'పావర్టీ ఆఫ్ ఫిలాసఫీ' అని రచించి వ్యాప్తిలో కొచ్చాడు.

ఉన్నదానితో తృప్తి పడేవాడు దరిద్రబాధ యెరగడు. ధనాశచే పీడింబడే భాగ్యశాలికి యెంతవున్నా దరిద్రుడల్లే బాధకు లోనౌతాడు. కవిత్వశైలిలో కవి దీనినే మరింత వ్యంగ్యంగా అల్లి దేవుని గురించి చెప్పాడు. మేరుపర్వతం అంటే బంగారుకొండ. కష్టజీవికీ తృప్తిగల వానికీ యీ కొండక్కర్లేదు. తృప్తి లేనివానికీ కొండ యిచ్చినా తృప్తి కలగదు. మరి దేవుడు దీని నెందుకు సృష్టించినట్లు? సామెతా అదే చెపుతుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' పీడించేవానినీ, పీక్కుదినే వానినీ దరిద్రం వదలదు.

భావదారిద్ర్యం అంటే వివేకం లోపించి పరిస్థితులుగానీ, దుష్ఫలితంగానీ యెందుకొచ్చిందో గ్రహించలేకపోవటం. లోతు తెలుసుకోకుండా నీళ్లలోకి దిగి ''చాలా లోతున్నదే'' అనుకోవటం.

ఇటువంటి మనస్తత్వాలుగలవారిని చూస్తూనే వుంటాము.

ప్రజాకవి వేమన హాస్యమాడాడు. ''కనకమృగము యిలను కలదు లేదనుచును। తరుణి విడిచి చనియెం దాశరథియు తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా!'' తమ్ముడన్నాడుగూడాను ''అది మాయలేడి'' అని. కాని తమ్ముడూ వదిన సీతాదేవి దూషణకు తట్టుకోలేక వెళ్లిపోయాడు. రాముడు

లేడి అందటం లేదని చంపి రాక్షసమాయ తెలిసి తిరిగివస్తూ తమ్ముని చూసి ''వదినను వంటరిగా వదిలి రావచ్చా? దూషించిందనుకో లేడి రాక్షసమాయ అని గుర్తించిన వాడివి, దాక్కుని వున్నారేమోనని వూహించవద్దూ?'' అన్నాడు. అది భావదారిద్ర్యమే. తీరా వెళ్తే సీతాదేవి లేదు. సంగ్రహించబడింది. భావదారిద్ర్యాన్ని నావెల్టీ రూపంలో చెప్పాడు ఆదికవి.

అవి రెండవ ప్రపంచ సంగ్రామం వూపందుకున్న రోజులు. హిట్లర్ గెలుస్తూ ఆక్రమణ చేస్తుంటే బ్రిటిష్‌వారు కాలనీస్ ఒక్కొక్కటే కోల్పోయారు. సిద్ధంగా లేరు గనుక యుద్ధ సామాగ్రీ తగినంత లేదు. వున్నది తరిగిపోతున్నది. మొదట పౌరుషానికి పోయి తామే గెలవగలమని బింకాలు పలికారు గానీ, త్రాహి త్రాహి అనాల్సిన కాలం వచ్చేసింది. తగినంత సైనిక బలమూ లేదు. కాలనీలోని వారిని యెర చూపి పిలుస్తున్నారు రిక్రూట్‌మెంట్ జరుగుతున్నది.

తనకు మంచి క్రెడిన్సియల్సే వున్నాయనే ధైర్యంతో విశ్వనాథం ధరఖాస్తు పెట్టాడు. యెదురు తెన్నులు చూస్తున్నాడు పిలుపు కోసం. నిరాశా! వుత్సాహం చల్లారటం మొదలైంది. అటువంటి సమయంలో పరిమళ అనే యువతి తటస్థపడింది.

లండన్ మీద బాంబు విసిరి యుద్ధశంఖం పూరించిన ఫ్యూరర్ యొక్క యూజీ విక్టరీస్ అతని తలను తిప్పేసినై. కోల్పోయిన కాలనీస్ ఆక్రమిస్తున్నాడు. పాదాక్రాంతులౌతున్నారు. మతిబోయినట్లు హిట్లర్ ఆంటీసెమెటిక్ వుద్యమం మొదలెట్టి యూదుజాతిని తుడిచి వేయాలని పథకం వేయించాడు. పథకం పేరు ఫైనల్ సొల్యూషన్. సలహాదారులు గుర్తు చేశారు. ''కోల్పోయిన కాలనీస్‌ని గెలుచుకుందామన్నావు ఫ్యూరర్! గెలుచుకొస్తున్నాము. సంబంధంలేని,

పనికిరాని, హానికరమైన, ప్రాణి హింసతో కూడిన పథకం ఫైనల్ సొల్యూషన్ ఆపేయ్.'' ఆ సలహా అతని చెవిలో దూరలేదు.

కొన్ని సర్టిఫికెట్లు ప్రొడ్యూస్ చేయటం కష్టమై, అవి అందాక పరిమళ విశ్వనాథాన్ని కలుసుకున్నది అతని ఆఫీసులో.

''నమస్తే, సర్! మీరు ఆనరరీ ఆఫీసరని తెలుసుగానీ, యీ అప్లికేషన్ మీద మీపై అధికారి చేత సంతకం పెట్టించి యిప్పిస్తే నా ఫీజు కొట్టేస్తారు సార్! మీ మేలు మరువను. తక్కిన సర్టిఫికెట్లు సంపాదించ గలిగాను గానండీ యిది జటిలమైంది'', అని చెప్తూ అప్లికేషన్‌ఫారమ్ విశ్వం ముందుంచింది. రెండు పళ్లు తాజావి కమలాలు బల్ల మీదుంచింది పరిమళ. నిలబడే వున్నది.

వరీ అవుతూ, పిలుపుకోసం తపిస్తున్న విశ్వం ఓసారి తలెత్తి పరిమళను చూసి, ''పెట్టించి యిస్తాను. రేపు రావాలి. ఆఫీసర్ కాంప్ వెళ్లారు. రేపు వస్తారు.'' మళ్లా పనిలో మునిగాడు.

మూడవనాడు ప్రత్యక్షమైంది పరిమళ. సంతకం చేయబడిన అప్లికేషన్ అందిస్తే అందుకుని థాంక్సు చెప్పి పరుగుదీసింది. పరిమళ వైద్య విద్య నేర్వటానికి మార్గం సుగమమైంది.

2

ఆర్డర్సు వచ్చినై. ఇంటర్వ్యూకి రమ్మన్నారు. వన్‌వే టికెట్ యిస్తారు. సెలెక్టు అయినట్టే. విశ్వం మనసు పరుగులు దీసింది. ఉరకలు వేసింది. ఆనందిస్తుండగా, అప్లికేషన్‌లోని పరిమళ అడ్రస్ గుర్తు వచ్చింది. యెటుబోతున్నదీ చూసుకోకుండా వాళ్లింటి కెళ్లాడు.

వాకిట్లో నిలబడివున్న మనిషి పరిమళ పోలికలు గలవాడు అడిగాడు.

''యెవరు కావాలండీ?''

''పరిమళగారిల్లిదేనా? మెడిసిన్లో సీటొచ్చి చేరింది.''

'' ఇదే. పరిమళా! ఆఫీసరుగారెవరో వచ్చారు.''

లోపల్నించి కాలి మెషీన్‌సూయింగ్ మెషీన్ చప్పుడు వినిపిస్తున్నది. పరిమళ బైటికొచ్చింది.

''నమస్తే. లోపలికి రండి'' అని లోపలికి దారితీసింది. ఓ పాత కుర్చీ చేతులు లేనిదీ, బల్ల సీటుగా వున్న యినపకుర్చీ తెచ్చి అమర్చింది. పరిచయం చేసింది.

'' ఈ ఆఫీసరుగారే పూర్తి జీతం కట్టేసే అప్లికేషన్ మీద సంతకం పెట్టించి యిచ్చారు. అంత తేలిగ్గా లభిస్తుందనుకోలేదు''.

ఒక గ్లాసులో నిమ్మ షర్బత్ కలిపి చల్లని నీళ్లు కలిపి తెచ్చి అందించింది. సాయంత్రం అయిదున్నర అయింది. ''హోమ్‌మేడ్ డ్రింక్ సార్!'' అని నవ్వింది. నిలబడే వున్నది. లోపల్నించి చూస్తున్నారు.

''చాలా రుచిగా వున్నది.'' డ్రింక్ పూర్తిచేసి గ్లాసందించాడు.

తన ఆర్డర్స్ అఫిషల్ పేపర్స్ లెదర్ బాగ్‌లోంచి తీసి అందించాడు. చదివి కంగ్రాచ్యులేషన్స్ చెప్పింది.

పరిచయాలు జరుగుతుండగా బాంధవ్యం వెల్లడైంది.

''నువ్వు వచ్చి సంతకం పెట్టించమని అడిగిన వేళావిశేషం'' అని నవ్వాడు

విశ్వం. ''అలా వెళ్లి షాపింగ్ చేసి వద్దాం. నీక్కావల్సినవీ, నాక్కావాల్సినవీ కొనుక్కుందాం.'' అని లేచాడు విశ్వం. తన అఫిషల్ పేపర్సు భద్రం చేశాడు. పరిమళ యింట్లోకి చూసింది. పర్మిషనిచ్చినట్టు తలూపారు. ఆరు దాటింది. వీధి దీపాలు వెలిగాయి. వాళ్లిద్దరి ముఖాలూ వెలిగాయి. అతని పిలుపు అహ్లాదకరంగా వున్నది. వాళ్లిద్దరూ షాపింగ్ పూర్తిచేసి, సినిమాహాలులో దూరి ముగియవచ్చిన చిత్రం చూసి, జట్కాలో యింటి కొచ్చారు.

భోజనం చేసి వెళ్లమన్నారు. ఆపని కానిచ్చి వెళ్లిపోయాడు.

3

ఆ వెళ్లిపోయిన విశ్వం, మిలటరీ దుస్తుల్లో, టోపీతో యింద్రునిలాగా వెలిగిపోతూ వచ్చాడు. తన వారినందరినీ చూచి రమ్మని శలవిచ్చారు అధికారులు. పరిమళను వెంటబెట్టుకు తిరిగాడు. ఇంకా కావల్సినవి కొనిబెట్టాడు.

''నన్ను ఫ్రంట్‌కి పంపుతారు పరిమళా. యుద్ధం ముమ్మరం గానే వున్నది. మళ్లా శలవెప్పుడు శాంక్షనౌతుందో, యెప్పుడొస్తానో చెప్పలేను. నీకు యిబ్బంది కలక్కుండా అరేంజ్ చేశాను. కాని నిన్ను చూశాకే నా కల నిజమైంది.'' అన్నాడు.

బెజవాడ స్టేషన్లో రాత్రి పదిన్నర గంటల వేళ, స్టేషనంతా బ్లాకౌట్ అయినప్పుడు, హెడ్ లైట్స్‌కి సగం మేర వరకు తారుపూయాలని ఆర్డర్సు వచ్చినప్పుడు, లైట్స్ చుట్టూ నల్లని కవర్ వెల్తురు కేవలం కిందికే ప్రసరిస్తున్నప్పుడు మిలటరీ రైలుపెట్టె గేటులో నిలబడి హేండిల్ పట్టుకున్న విశ్వం, వెలవెలపోయే పరిమళ మొహంగానీ, తడి అవుతున్న కళ్లుగానీ గమనించలేకపోయాడు. రైలు

కదిలింది. తెల్లని చేయీ, తెల్లని రుమాలు తదేకంగా చూచింది. మిలటరీ రైలు వేగమందుకున్నది.

అంతా అంధకార బంధురమైంది. శాంతి పథము కానరాలేదు. తారుమారై పుత్తరాలూ లేవు. మనిషీ లేడు.

చిరిగిన సెన్సార్ చేయబడిన అలుక్కుపోయిన అక్షరాలున్న ఒక పుత్తరం పడేశాడు పోస్టుమేన్ రామ్‌సింగ్.

బాంబుదాడులు జరిగాయి. దేశంలో అల్లర్లు లేచాయి. పత్రికలాగిపోయి పత్రికాధిపతులరెస్టయినారు. రంగూన్, సింగపూర్, అండమాన్స్ కోల్పోయారు. పెరల్ హార్బర్ మీద అమెరికా బాంబు పడేసింది. క్విట్ ఇండియా నినాదం, వాల్ పోస్టర్స్ సీలయన్ తోకముడిచింది. సూర్యుడస్తమించని సామ్రాజ్యంలో చీకట్లు వ్యాపించ సాగాయి. యెక్కడి సైన్యాన్ని అక్కడొదిలేసి బ్రిటిన్ చేరుకోవాలని బ్రిటిష్ తహతహలాడారు.

అమెరికా, రష్యా మేల్కొన్నాయి. హిట్లర్ అందర్నీ వంచిస్తున్నాడనీ తనవారినే చంపిస్తున్నాడని తేలింది. డిక్టేటర్ తప్పితే తన దేశాన్ని వుద్ధరించాలని లేదు. దేశానికి పేరు తేవాలని లేదు. పూర్వపుటౌన్నత్యం తేవాలని లేదు. థర్డ్‌రీ కూలుతున్నది. టపాకాయలైపోయినట్లు యుద్ధసామాగ్రి అయిపోయింది. ఇటలీ నియంత ముసోలినీ పట్టుబడ్డాడు. నూట నాలుగు మిలియన్ల ప్రాణనష్టం జరిగింది. వదిలి వేయబడిన సైనికులను పోగుచేసి తర్ఫీదిచ్చి వారితో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఢిల్లీ వస్తున్నాడని ఆశించారు భారతీయులు. కోహిమా వద్ద ఆయన విమానం నిప్పంటుకుని కాలిపోయిందని చెప్పుకున్నారు. మిత్రసేనలు గెలిచాయి. హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. యుద్ధజ్వాల చల్లారినా అక్కడా

అక్కడా యింకా మంటలు కానవస్తున్నాయి.

క్విట్ ఇండియా మూవ్‌మెంటుతో బ్రిటిష్ తన కాలనీ భారత్‌ను వదలాల్సి వచ్చింది. సంప్రదింపులు జరిగి దేశం విభజింపబడింది. దేశ విభజన సమయంలో దారుణాలు జరిగాయి. భారతమాత దాస్య శృంఖలాలు పగలగొట్టబడి వూడిపోయేనాటికి, అన్నదమ్ములంటి రెండు మతాలవారు విడిపోయారు.

మొదటి ప్రధాన మంత్రి పండిత జవహర్‌లాల్ నెహ్రూ. మొదటి దేశాధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్. గవర్నర్ జనరల్ శ్రీ రాజాజీ, హోం మంత్రి శ్రీ వల్లభాయ్ పటేల్. అధికార మప్పగించినది లార్డ్‌మౌంట్ బాటన్. తేదీ పందొమ్మిది వందల నలుబది యేడు ఆగస్టు పదిహేను రాజధాని ఢిల్లీ. ఎర్రకోటపై యూనియన్ జాక్ దింపబడి మూడు రంగుల జెండా యెగురవేయబడింది.

తనదేశం వేపు వెళ్తున్న సైనికులతో, గుర్తుపట్టవీలులేకుండా అయిన విశ్వం, నల మహారాజు బావుకుడైనట్టు, తన దేశానికి బయలుదేరాడు. శక్తి, యుక్తి, సాహసం, ఓరిమి పట్టుదల, ఆశా విశ్వాన్ని ప్రాణాలతో వుంచినై. అవి దారిచూపగా మాతృభూమిమీద అడుగుంచాడు. దారీ తెన్నూలేదు.

రికార్డ్సు లేవు. సర్టిఫికెట్సు లేవు. తెలిసిన మొహాలు లేవు. మిలటరీలోకి తీసుకున్నవారు లేరు.

గంగ నీరూ, గోదావరి నీరూ, జననివంటి జన్మభూమీ అతని ఆరోగ్యాన్ని చక్కబరచి, ఆశలు చిగురింప జేశాయి. చేయగలిగిన పనల్లా చేశాడు. అంది వచ్చిన జాబల్లా చేశాడు. తానెవరయిందీ ఋజువు చేయాలి. పరపతి

సంపాయించాలి. కొంతకృత్యుడై పుట్టిన వూరు చేరగలిగాడు విశ్వం.

దేశంలో పంచ వర్ష ప్రణాళికలూ, ప్రాజెక్టులూ మొదలైనై. తన ప్రణాళిక నెరవేర లేదు. ప్రాజెక్టేమైందో! అనుకుంటూనే రెండో ప్రాజెక్టుకి శంకుస్థాపన చేశాడు విశ్వం. ఫండ్ కావాలి పుష్కలంగా.

తన దేశీయులు పదవులకై పాకులాడుతూ, ధనార్జనలో మునిగి కనిపించారు.

4

విశ్వనాథం విశ్వనాథునిలాగే దయాప్రేమా ఖర్చు చేస్తూ తన మొదటి ప్రాజెక్టునందుకున్నాడు. పరివంళా విశ్వం కథ, న్యూస్ రీల్స్, అడ్వర్‌టయిజ్‌మెంట్, రాబోవు చిత్రాలు చూపటమయాక మొదలైన అసలు చిత్రంలాగా మొదలైంది.

అతని కళ్లు పరిమళ కోసం వెతుకుతూ వుండగా, మున్సిపల్‌స్టేడియంలో, రాత్రి యేడుగంటల వేళ రంగు దీపాల వెలుగులో రోలర్ స్కేటింగ్ చేస్తూ చిత్రగతులు నేర్పుగా ప్రదర్శిస్తూ కంటబడింది. ప్రదర్శన పూర్తి అయేవరకు వేచివున్నాడు. పరిమళ తనతోటి ఆర్టిస్ట్సు దగ్గర కొచ్చి నిలబడింది. అప్పుడెళ్లాడు పలకరించాడు. కన్నార్పకుండా చూసింది.

'' ఈ ఆర్ట్‌లో నిపుణత చూపుతున్నావేం పరిమళా? మెడిసిన్ ప్రాక్టీస్ చేస్తూ జాబ్ చేస్తూ కంటడతావనుకున్నాను'' అన్నాడు నింపాదిగా.

యేడుపు దిగమింగింది. ఆవేశం ఆశ్చర్యం అణిగిపోయాయి. అదిరే

గుండెలు నార్మల్సీకి వచ్చాయి. తాపీగానే జవాబిచ్చింది.

''మీరు ఖైదీగా పట్టుబడ్డారని అన్నారు. ఖైదీల మార్పిడీ గురించీ తెలుసుకునీ, వినీ, పత్రికల్లోగూడా వెతికాను. కానీ విశ్వనాథుని పేరే కంటబడలేదు. ముఖచిత్రం అసలే లేదు'' అన్నది. తలవంచింది. తన పేరు పలకగానే విశ్వం ఒళ్లు పులకరించింది.

ఐదేళ్ల పిల్లాడు వచ్చి పరిమళ చేయి పట్టుకుని బడ్డాడు. కొత్త ముఖం చూశాడు. విశ్వమూ చూశాడా పిల్లాడిని. మరో యిద్దరమ్మాయిలూ యిద్దరబ్బాయిలూ వచ్చారు.

''పిన్నీ! మేం వెళ్తామిహ. గోపీని పట్టుకోటం కష్టమైంది. తానూ స్కేటింగ్ చేయగలనని లేస్తాడు. కబుర్లు చెప్తూ, దీపాలు చూపుతూ, నీవిచ్చినవి తినిపిస్తూ ఆపాము. నీ ప్రోగ్రాం అయి నువ్వు వచ్చేయటం చూడగానే లేచాడు. చేయి వదలకు. తప్పిపోతాడు. ఆర్కెస్ట్రా ఆకర్షిస్తున్నది వాడిని'' అని చెపుతూ చేతులూపి వెళ్లిపోయారు.

''అమ్మా! పోదాం రా. బండీపట్టుకోవాలి. నడవలేవు'' అన్నాడు పిల్లాడు.

సరిగా వూహించలేక పోయాడు గానీ విశ్వం, కొంత వూహించగలిగాడు. రైలు కదలగానే చేతుల్లో మొహం దాచుకుని నిలబడిన పరిమళ గుర్తొచ్చింది. తన వియోగం తలుచుకుని దుఃఖిస్తూ వున్నదనుకున్నాడు. రైలు పెట్టె వాకిలి వద్ద నిలబడి చూస్తున్న విశ్వం. కాని ప్రాజెక్టెందుకు ఆగిపోయిందో అర్థంగాలేదు. తానన్నీ అరేంజ్ చేసేవెళ్లాడే ఫ్రంటుకి. పొరపాటు యెక్కడ జరిగిందో వూహకందలేదు. ఇద్దర్నీ చూసి,

''నేదింపుతా మీ యిద్దర్నీ రండి. మంచి కొత్త జట్కా మాట్లాడి గేటు దగ్గరుండమని చెప్పి నిలబెట్టించి వచ్చా). ఇంతమందిని తప్పించుకు వెళ్లం కష్టం. నువ్వెళ్లి చెప్పిరా పరిమళా ప్రోగ్రామ్ అరేంజ్ చేసినవారితో. నేనూ గోపీ చేతులు పట్టుకుని యిక్కడే వుంటాము''.

విశ్వం చేయి పట్టుకు నిలబడిన గోపీని చూసింది పరిమళ. వెళ్తున్న తల్లి వేపే చూశాడు గోపీ.

5

చేస్తున్న జాబ్ అంత మంచిది గాదు. మంచిది అందే దాకా పరిమళనీ గోపీనీ వారున్నచోటే వుంచితేనే మంచిది. తీసికెళ్తే తిప్పలు పడుతుంది. తనకే అవస్థగా వుందని చూశాడు విశ్వం.

ఆశాపాశము తాకడున్నిడుపు అన్నట్లు తానెవరో ఋజువుచేయటానికి ఆశతో శ్రమించాడు విశ్వం. అది నెరవేరింది. మళ్లా ఆర్మీలోకే పోవాలని ట్రై చేశాడు. దిల్లీ, బొంబే, కలకత్తా, మద్రాస్ వెళ్లి ఆఫీసర్లనీ, తెలిసినవారినీ కలుసుకున్నాడు. తీసుకుంటామనే ఆశపెట్టారు. బ్రిట్స్ తనను అడవులలో వదిలివెళ్లే నాటికి తాను కప్తాను. అదీ ఆశ. వాహనం తిరగబడి తాను విసరివేయబడినప్పుడు, బిరుదు పట్టాలు, హోదా చెప్పేవీ పోయాయి. డ్రైవరు పోయాడు. మరో నలుగురాఫీసర్లకి తలకి గాయాలై స్పృహ కోల్పోయారు. సహాయం అందటం ఆలస్యమైంది. తక్కిన వారి పేర్లూ చెప్పాడు విశ్వం. కానీ సంచీలు చేతులు మారి పనులు నెరవేరుతున్న ఆ సమయంలో విశ్వం చేతికి ఖాళీ సంచీ వేలాడుతున్నది. అది యూస్‌లెస్. అందుకని మెల్లకన్ననీ, ఆస్త్మా వున్నదనీ, మతి సరిగా లేదనీ, డాక్టర్ చేత సర్టిఫై చేయించి పంపేశారు అధికారులు.

పట్టువీడని విక్రమార్కుని లాగా, బేతాళుని చెట్టునించి తీసి మోసుకొచ్చిన వానిలాగా, మౌనంగా శ్రమిస్తూ, మంచి జాబ్ తెచ్చుకున్నాడు విశ్వం. అన్నీ అరేంజ్ చేసి, పరిమళనూ గోపీనీ తెచ్చి దగ్గర పెట్టుకున్నాడు. మరో నాలుగేళ్లలో మరో యిద్దరు ఫామిలీ మెంబర్సు చేరారు బంగ్లాలో. వారి క్రీడలతో తప్పటడుగులతో విశ్వం తాను పడిన శ్రమ మరచిపోగలుగుతున్నాడు. ఇంకా తెలియనివి వున్నాయని తెలియదు.

## 6

సంసారసాగరానికీ ఆటూపోట్లున్నాయి. దొంగ అలలు వున్నాయి. హోరూ వినబడుతుంది. కల్లోలమూ వుంటుంది. జలచరాలంటివారూ వుంటారు.

''పరిమళా! నా వేపు వాళ్లొస్తే పూసుకుతిరగవేం? బాంధవ్యం కలిపి పిలవ్వేం? పెడసరంగా జవాబిస్తావుట. పొరుగింటి పొయ్యిలా వుంటుందిట నీ ప్రవర్తన. పెడకట్టె మాటలూ, వస్తున్నవాళ్లకు యెదురెళ్లి సాదరంగా పిలవవు. మర్యాదలూ లేవు. నౌకరు చెప్పేదీ వినవుట. కుక్ యేదో అడిగితే విననట్టు వెళ్లి పోయావుట. వాళ్ల మొహంగూడా చూడవాయేం? సీతచుట్టూ వుండే రాక్షసులల్లే లేరే వాళ్లు. మా అబ్బాయి జబ్బుపడి, చిక్కి శల్యమై వచ్చాడు'' ఆఫీసుకి సిద్ధమౌతున్న విశ్వానికి అన్నీ అందిస్తున్న పరిమళ వచ్చే నవ్వుని అణిచేసింది.

''అసలు వైద్యవిద్య నేర్వాలని కాలేజీలో అడుగిడిన నువ్వు యెందుకాపేశావో నిజం చెప్పమంటే నవ్వి పారిపోతావు. ఇవాళ చెప్పాల్సిందే.''

టై ముడేసుకుని, నిలువుటద్దంలో చూసుకుంటూ క్రాపు దువ్వుకుని డ్రెస్సింగ్ టేబిల్ మీదుంచాడు దువ్వెన. హాంగర్‌నించి కోటు విడదీసి అటు తిరిగివున్న విశ్వానికి యెక్కిస్తూ నిలువుటద్దంలో విశ్వం ప్రతిబింబం చూసింది పరిమళ.

''చెప్పటానికి నాకేమీ అభ్యంతరం లేదు సార్. మీ ఫీలింగ్స్ హర్ట్ చేస్తానేమోనని దాటవేస్తున్నాను. ప్రభుత్వం మారంగానే వేరే పార్టీ వారు అధికారంలోకి రాగానే, దీపముండగానే యిల్లు చక్కబెట్టుకోవాలని స్వలాభం చూసుకుంటూ, ప్రజలకై మొదలుపెట్టబడిన ప్రాజెక్టుల సంగతి పట్టించుకోరు. ఆ కాగితాలు రికార్డులు దుమ్ముకొట్టుకుంటై. వాటిమీద దుమ్ము పేరుకుంటుంది. ఫండ్స్ విడుదల గావు. లోటు బడ్జెట్, నిధులు కొరతా చూపి పంపేస్తారు. త్వరపడి ప్రాజెక్టు పూర్తి చేయాలనే వారికి. పులిమీద పుట్రలాగా మరో ఆపద. సమిష్టిగా వుంటూ ఒకరికొకరం సాయపడుతూ పైకి రావాలనే కుటుంబంలో టూ మచ్ స్రావమై డెలివరీకాక ఆపరేషన్‌కు సిద్ధమై మా కజిన్ పోయింది. పొదుపరి యిల్లు దిద్దే కజిన్. రిక్రూట్ అయి ఆర్మీలో ఆక్జిలరీ నర్స్‌గా సెలెక్టయి వెళ్లిన కజిన్ బాంబు దాడికి గురై తలకి గాయాలై యేమైందోగూడా వార్త రాలేదు. అన్న జాబ్ ముగిసింది. అదీ టెంపరరీయే. వాడూ ఆర్మీలోకే వెళ్లాడు. ఖైదీగా పట్టుబడ్డాడో, వదిలి వేయబడి స్వదేశానికి రాలేకపోయాడేమో. నేను రిప్రొడక్షన్‌కి తయారై, జీతం కట్టక్కర్లేకపోయినా తక్కిన వాటికి కటకటలాడి, యిల్లు మానేజ్ చేయాల్సి వచ్చింది. తల్లి కాశీ వెళ్లి మలేరియాతో తిరిగి వచ్చింది. కడుపులో అల్సర్ అన్నారు. ఆపరేషన్. చాలనుకుంటా సార్. మీరు చాలా యిక్కట్టులోనే వున్నారు. మంచిరోజుల కోసం చూస్తూ రెండోసారీ వదిలి వెళ్లారు. స్టడీస్ కంటిన్యూ చేసే అనుకూల పరిస్థితులు రానేలేదు సార్. కృష్ణదేవరాయలులాగా

రియల్ కలర్స్ ఒకరు చూపితేగాని కనపడవేమో సార్ మీకు. క్రైసిస్‌లో యిరుక్కున్నవారిని గట్టెక్కుదామని రారెవరూ. నేడు బెల్లమున్నది చీమలు చేరుతున్నాయి'' అన్నది పరిమళ.

రికార్డ్ విన్నట్టు చూశాడు. ''నా అరేంజ్‌మెంట్స్ యేమైనాయో!'' అని స్వగతం బైటికన్నాడు.

''యేమో ఎంక్వయిరీ చేయండి సార్. మెటర్నిటీ వార్డ్‌లో వుండి నార్మల్ డెలివరీకి చెల్లించాల్సి వస్తే, బుక్స్ అమ్మి చెల్లించాను'' అని కిచెన్‌లోకి పరుగుతీసింది పరిమళ.

వారం గడిచింది. ఎబార్షనిస్ట్ డాక్టర్ నిఖిల కోర్టులో సాక్ష్యమివ్వాల్సి వుండి వచ్చింది బంగ్లాకి. ఆ నడివయస్కురాలికి ఆమె మిడ్‌వైఫరీ ప్రొఫెసరని బ్రహ్మరథం పట్టాడు విశ్వం.

నిఖిల పరిమళని యెగాదిగా చూసింది. ''భోజనం చేసే కోర్టు కెళ్తా విస్సీ. కారు పిలిపించు. నీ మిసెస్‌కి నలభై వెళ్లినట్టున్నాయి. మళ్లా నెలలు. యెబార్షన్ చేయించుకోమను. కాన్పు అయితే ట్రబుల్ రావచ్చు. నేను నిరపాయకరంగా పూర్తి చేసే వెళ్తా. మేల్ అయినా ఫిమేల్ అయినా ఖర్చే. పెంచద్దూ!'' అన్నది కాఫీ తాగుతూ.

ఇల్లు తడిగుడ్డతో తుడుస్తున్న పనిమనిషి మంగ తలతాటించి, ''అమ్మకి ముగ్గురే సంతానం. కననీ. బాబు మంచోడు. మంచోళ్లు పుట్టాల ప్రపంచంలో.'' బకెట్‌లో గుడ్డ బడేసి మోసుకుపోయింది. కిచెన్‌లో దూరి పరిమళకు వార్నింగిచ్చింది.'' దాని మాట వినకమ్మా, నా మాటిను. నా బిడ్డకు ఆపరేషన్

చేసి యీ డాక్టరమ్మ పట్నమెల్తే రగతం కోల్పోయి నా కూతురు పోయింది. గూడు చిన్నబోయె. గూటిలో చిలకేదీ, దాని కూనల్ని నేనే సాకుతున్నాను.''

'' ఇదా నీ మెయిడ్ విస్సీ? నెత్తినెక్కించుకున్నావే'' అన్నది నిఖిల. మూడు రోజులున్నది నిఖిల. తలంటి పోసుకున్నది. పరిమళ చీర కొత్తదడిగి తీసుకుని కట్టుకున్నది. భోజనం కానిచ్చే వెళ్లి రైలందుకున్నది.

పిల్లలు యింటిముందు ఆడుతున్నారు. మంగ యిల్లు కడిగింది. పండగ వస్తున్నదని పరిమళ ముగ్గులు పెడుతున్నది. పొద్దూకుతున్నది. విశ్వం ఆఫీసునించి వచ్చి, బెడ్ రూమ్‌లోకి వెళ్లి దుస్తులు మార్చుకుంటూనే అరుస్తున్నాడు.

''పరిమళా! నిఖిల వెళ్లిపోయింది నిలకడలేని మనిషాయేం? యెబార్షన్ సంగతెత్తింది తానే. మాట తప్పిందే. అయ్యో! నిన్న రాత్రి పొద్దుబోయి కాక్‌టెయిల్ పార్టీనించి క్లబ్బు నించి వచ్చి బెడ్‌రూమ్‌లోకి వస్తే నాబెడ్‌మీద నిఖిల. నువ్వేమైనావూ? నువ్విలా నా బెడ్ మీద నైట్ డ్రెస్‌లో వుండవే అని వింత గలిగి చూతును గదా నిఖిల. నా ఖర్మ! ''నేనా గుడ్ లుకింగ్ స్టెనో పాటి చేయనా?'' అని యేడుపు లంకించుకున్నది. అయ్యో తెలివిగానే వున్నా గనక ప్రమాదం తప్పింది. రేప్ చేశాడని కేసుబెట్టాలని ప్లానేసిందేమో. క్లబ్బులో నా ఫ్రెండ్సు నవ్వుతూ వార్నింగిచ్చారు''.

''విశ్వం! నిన్ను పికప్ చేసుకు వెళ్దామని, మీ బంగ్లాకొస్తే నిఖిల కంటబడింది. ఇప్పటి కిద్దరి మీద రేప్ కేసు పెట్టింది. డేంజరస్ వుమన్. భద్రం'' అలా అరుస్తూ నవ్వుతూ తువాలుతో మొహం అద్దుకుంటూ డైనింగ్ రూమ్‌లో కొచ్చేప్పటికి, వేడి కాఫీ పకోడీల ప్లేటూ ఆహ్వానించాయి. కుర్చీలో కూచుని తింటూ అన్నాడు.

‘‘ ఓల్డ్ వుమన్‌లాగా సనాతనిస్టులాగా ఆ ముగ్గులేమిటి పరిమళా? నిఖిల లాంటి స్త్రీ వుంటుందా? నాకు తెలియదు’’.

‘‘వుంటుందండీ. ఆమె చూపు మీ మీదనించి కదల్లేదు. నవ్వు కపటం, వెకిలితనం వెల్లడించాయి’’ అన్నది.

ఫ్యూన్ వైరొచ్చిందని తెచ్చాడు. విశ్వం లేచి వెళ్లి సంతకం చేసి అందుకుని, చింపి చదివి గంతేలేస్తూ లోపలి కొచ్చాడు.

‘‘పరిమళా రేపు మా వాళ్లొస్తున్నారు. ఈ సారైనా నువ్వు యెదురెళ్లి ఫార్మాలిటీస్ చెల్లించాలి. రేపు ఆదివారం నేనింట్లోనే వుంటా. వెంటవచ్చి నేనే చేయిస్తాను మర్యాదలు. పోతావేం. నువే వెళ్లి నాల్రోజులుండి, అన్ని పన్లు అందుకుంటూ, రుచిగా యింత వండి పెట్టు, వంటమనిషి మానేసిందని వ్రాశారు అంటే అదీ వినలేదు నువ్వు’’ అన్నాడు.

‘‘అలాగే సార్. వంగకు జ్వరంట. కొంచెం కషాయమిస్తే తాగిపోతానన్నది. ఇవ్వాలి’’ అని వెళ్లిపోయింది పరిమళ.

7

మహాలయ పక్ష ప్రారంభః దేవీ నవరాత్రి ప్రారంభః, సరస్వతీ పూజా, కలశ స్థాపన, దుర్గాష్టమీ, మహానవమీ, విజయ దశమీ, జమ్మి కొట్టే దినము. గోడకు వేలాడుతున్న కాలెండరు కాగితం చదివింది పరిమళ. కుక్ వచ్చింది. తలారా స్నానం చేసి మడిగట్టి ఆరేసిన పట్టుచీరా రవికా ధరించింది. తల ముడేసి గన్నేరు పువ్వుమందారా తురిమింది. కుంకుమ దిద్దుకున్నది. సూర్యుని మీద దండకం వల్లిస్తూ కాఫీ ఫలహారం సిద్ధం చేస్తున్నది. కుంపటి మీద తురిమిన

బూడిద గుమ్మడి నేతిలో వేయిస్తూ కలుపుతున్నది. పంచదార పోసింది. మిఠాయి రంగు పాలలో కలిపి హల్వా మీద పోసి మళ్లా కలియబెడుతుండగా హల్వా ముద్ద అవుతున్నది. జీడిపలుకులు, కిస్‌మిస్ నేతిలో వేయించి పళ్లెంలో వుంచింది. ఏలకిపొడి సిద్ధం చేసింది. హల్వా కంటికింపుగా వస్తూ మంచి వాసన వస్తున్నది.

విశ్వం పరిమళ బుజాల మీద చేతులేసి వాకిట్లోకి నడిపించుకెళ్లాడు. కారులోంచి బందుగులు దిగారు. ''అను'' అని మెల్లిగా అంటూ మొహంలోకి చూశాడు విశ్వం.

పరిమళ చిరునవ్వు చిందిస్తూ, ''లోనికి రండి, చిక్కిపోయినారు. బడలివున్నారు. స్నానానికి వేడి నీళ్లు బకెట్లలో వుంచాను. కాఫీ ఫలహారం చల్లారిపోతున్నది.'' అన్నది. ''స్నానాల గదిలోనే వంకెకి పొడి బట్టలున్నాయి.'' అని లోపలి కెళ్లిపోయింది.

కొంతమందికి ఆ ఫార్మలిటీ వినోదమిచ్చింది.

పెద్ద బెడ్‌రూమ్‌లో వాల్చివున్న బెడ్స్ క్లీన్‌షీట్స్ చూశారు డ్రెస్సింగ్ టేబిల్ వాసన నూనె, దువ్వెనలు. బొట్టు, కాటుక, పౌడరు.

పిల్లలు పెద్ద కళ్లతో బెదురుతూ చూసి దూరంగా తిరిగారు.

వంటామె డైనింగ్ టేబిల్‌మీద అన్నీ అమర్చింది. అంతా వచ్చి కూచుని తినసాగాక మారు వడ్డన చేసింది.

''వంటిల్లు గోమయం పసుపునీటితో శుద్ధి చేసినాను. నేను పెందలకడే వచ్చి తలారా స్నానం చేసి మడికట్టి పదార్థాలు చేసినాను'' అని పాఠం వప్పజెప్పింది.

బల్ల క్లీన్ చేసే అమ్మాయి.

పన్నెండింటికి భోజనం. పరిమళ నేలతుడిచి పీటలేసి అరిటాకులు పరిచి తడిబట్టతో తుడిచింది. కుక్‌మంచి నీళ్లగ్లాసులుంచి, వేడి పదార్థాలు వడ్డించింది. నేయి అభిగరించింది. గడప వద్ద నిలబడి చూస్తూ మారు వడ్డన చేసింది. నాలుగున్నరకి తేలికఫలహారం, కాఫీ సర్వ్ చేసింది. రాత్రి తొమ్మిదింటికి భోజనం.

అలా ముచ్చటగా మూడ్రోజులు గడిచాయి. పరిధి తప్పని గ్రహాల్లాగా తిరిగారు బంధువులు.

తల్లి మొదటి కంప్లెయింట్. మెట్లమీద తాను నిలబడివుంటే మీద నీళ్ల చుక్కలు పడేట్టు కల్లాపి చల్లిందట మంగ. దగ్గరుండి గూడా పరిమళ వారించలేదుట. పనిమనిషి నేమనలేదుట.

భోజనాలౌతున్నాయి. దొడ్లో బట్టలారుతున్నాయి. డ్రైవరు సుంకురామ కుక్ దగ్గరగా నిలబడి అభినయంతో సహా యేదో చెప్తున్నాడు. మరోసారి పరిమళ మంగ వంటామె యేదో గుడుగుడుమని చెప్పుకుంటూ కంటబడ్డారు. పిల్లలవేమో వర్ణభేదం లేకుడా పిల్లలతో ఆడుతూ యింట్లోకీ రానిస్తున్నారు. పరిమళనే నిలేసి అడిగారు ''అందరితో తిరగనిస్తావేం పిల్లల్నీ! ఆఫీసరు పిల్లలు గదూ''.

పరిమళపళ్లు బైట బెట్టింది. ''విశ్వనాథంగారు, కులభేదం పాటించరాదనీ, గుడికెళ్లద్దన్నీ, పూజలు వద్దనీ యే దేవునికీ మొక్కుకోవద్దనీ, అందరం సమానమేననీ పిల్లలకి బోధ చేశారు'' అన్నది.

వాన చినుకులలాగా చిన్న చిన్న తగాదాలు వినవస్తున్నాయి.

తిరుపతి చూసి వెంకన్న దర్శనం చేసుకుని అటునించటు యింటికి వెళ్ళిపోతారు బంధువులని చూస్తున్నాడు విశ్వం. తానే రైలెక్కించాలంటే రైలు ఛార్జీలిచ్చుకోవాలి. నెలాఖరు చేతిలో యెర్రని యేగానీ లేదు.

రాత్రిపడి నిశ్శబ్దమైంది. తలుపు గడియపెట్టి పరిమళతో సరసమాడాడు విశ్వం. ''నీ వాళ్లొస్తే పరిమళా నీవు రహస్యంగా డబ్బు అందజేసే అవసరం లేదు. మీ అమ్మ డబ్బు గుంజే అవసరం లేని పద్ధతి వున్నది. మీ అమ్మ కిచెన్‌లో మా అమ్మ చేతికింద పనిచేయచ్చు. బియ్యం కడిగివ్వటం, పప్పు రుబ్బి యివ్వటం కూరలు తరగటం. నీ బ్రదరేమో దేవతార్చన చేస్తాడు. తోడబుట్టినది స్పెషల్ స్వీట్లూ, హాట్సూ చేయచ్చు. సాయంకాలం పూట రెండో బ్రదరిన్లా టీచర్‌గా పిల్లలకి ట్యూటర్‌గా వుండి పాస్ అనిపించవచ్చు. అలా ఆశ్రయించుకుని వుంటే లాభం మర్యాద వస్తాయి'' అన్నాడు వాలుకుర్చీలో వూగుతున్నాడు.

తలుపు బిగించాడు అది చూసి పరిమళ బాగా నవ్వింది.

''నవ్వుతావేం నేను మంచి చెప్పాను. నవ్వేందుకేమున్నదిందులో'' అని దీర్ఘం తీశాడు విశ్వం.

''నవ్వు రాదా మరి విశ్వంగారూ! ఒక వూరి రక్తం మనది. దాయాదులం మనం. మొదటే బీరకాయ పీచు బాంధ్యం విన్నారు. మీ ఫ్రీ లవ్ తార్రోడ్డు మీద పరుగెత్తింది. మీకెలా తోస్తే అలా అరేంజ్‌చేయటానికి వీలైంది. తల్లికి కర్రపెత్తనం అజమాయిషీ దాష్టీకం యిష్టం. డబ్బు చేతులో ఆడుతూ వుండాలి. బ్రదర్‌కి చౌకగా యేదన్నా అమ్మి హిమాలయ-ట్రెక్కింగ్‌కి వెళ్లటం యిష్టం. సిస్టర్ తానేమీ కొనదు. బజారెళ్లదు. అన్నీ అందిస్తే స్వీటూ హాటూ చేసి పందేరం చేసి తాను

తింటుందంతే. మరొక బ్రదరు పిల్లిలాగా, పిల్లి పాలకోసం కిటికీల్లోంచి తొంగి చూస్తుంది. చూసే వుండాలి మీరు, అందర్నీ చూస్తూ కూచుని తినట మెట్లా, యెవరు వుచితంగా చదివిస్తారు. నేను బుద్ధిమంతుడిని, ఒకరి జోలికీ సొంతికీ పోయేవాడిని గాదు అనుకుంటాడు'' అని పడుకున్నది.

రాని భాష విన్నట్టు విన్నాడు విశ్వం.

మరునాడు కుక్ గైర్ హాజరు. బేదులౌతున్నాయి రాలేదు అని ఖబర్ అందింది. పిల్లలు పిక్నిక్‌కి వెళ్లారు. పరిమళ కిచెన్ వేపు వెళ్లలేదు. విశ్వానికి క్లబ్‌లో పార్టీ వున్నది. పెళ్లి చేసుకుని వచ్చిన సాటి ఆఫీసర్ యిస్తున్నాడు విందు.

బంధువులకి వండుకోవాల్సి వచ్చింది. యెక్కడేమున్నామో వెతుకుతూ వండుకోటం యాతనయింది. అన్నీ అందిస్తూ అక్కడే తిరుగుతుంటే పరిమళని చీదరించుకుంటూ కసురుతూ పనిచేసుకుందామనే కోరిక తీరలేదు.

ఓ సారి పరిమళ అటుగా రాగా చూసి అవకాశం వదులు కోకుండా అననే అన్నది భ్రమరాంబ, విశ్వం తల్లి.

''నువ్వంటే భీష్మించి వుండగలిగావు గానీ మాకు ప్రేమానుబంధాలు పోవు. పిలవక పోయినా వస్తాము. కడుపు తీపి అలా తోల్తుంది. మేమే చదివించుకున్నాం గదూ'' అన్నది బియ్యం కడుగుతూ.

మూడోనాడు కుక్ వచ్చింది. నీరసంగా వున్నా యిబ్బంది పడతారని వచ్చేసిందట. కాని నసపెడుతూ చేసింది. మొదటి మర్యాదా సన్నగిల్లింది. గార్డెన్‌లో డ్రైవరూ భంట్రోతూ ''నువ్వెంతంటే నువ్వెంతని'' ఘర్షణ పడుతున్నారు. మంగ సద్ది చెప్పకపోగా పుల్లలెగసన దోసింది. తగూ పెద్దదైంది.

వీధి చిమ్ముతుంటే దుమ్ము లేచి కిటికీల్లోంచి లోపలి కొచ్చింది. నీళ్లలో ముంచిన బట్టలు తడవక ముందే తీసి ఫెడీ ఫెడీ బండ కేసి బాది, జాడించకుండానే పిండి తాడు మీదేసింది మంగ. కొన్ని వంటింటి ముందుంచి '' ఆరేసుకో '' అని అరిచింది. మడి నీళ్లు కుమ్మరించకుండానే అలాగే తీసికెళ్లి ఆరేసింది. ఆడబడుచు త్రిపురాంబ వెళ్లి పర్యవేక్షణ జరిపితే బట్టలు సరిగా తడవనే లేదని చూసి వచ్చి కంప్లైయింట్ చేసింది తల్లితో. పొమ్మనలేక పొగబెట్టినట్లున్నది.

పూజకు పూలుకోస్తున్న పరిమళ వద్దకి బిరబిరా వెళ్లి ''దాన్నివాళే మాన్పించు. అన్నిటికీ యెదిరొస్తున్నది. మరొక వంటామెను పిలిపించు. వాళ్లిద్దరేం చేస్తున్నదీ చూసి గూడా వూరుకుంటావేం?'' అన్నది చేయి జాడిస్తూ, మంగని చూస్తూ, ''యేం పొగరూ? యెంత నిర్లక్ష్యం. ఏం కులం నీది?'' అని కళ్లు పెద్దవి చేసింది భ్రమరాంబ.

మంగకి రగులుకు పోయింది. అవతల ఘర్షణా ఆగలేదు. చిలికి చిలికి గాలివానలాగా అయింది.

''నీ వంటోళ్లని చానా మందిని చూశానమ్మోవ్! తప్పు పట్టుతున్నావే. పెద్ద పెద్దోళ్ల యిళ్లలో చేశాన్నేను. ఒక్కమాట పడలేదు. తీసేయమని అమ్మకు ఆర్డరేశావు గానీ, అమ్మ నన్ను డిస్మిస్ చేయలేదు. ఆమె కధికారం లేదు. బాబే పనిలో పెట్టాడు. బాబే జీతమిస్తాడు ఫస్టున. బోనసిస్తాడు పండుక్కి. సడెన్‌గా తీయలేవు. నోటీసివ్వాల. మూడు నెలల జీతమిచ్చి పంపేయాల. మరో యిల్లు కుదరద్దూ? యేటి నీ గొప్ప? నీకు తెల్దేమో యూనియనుండాది. నేను మెంబర్ని. లీడర్‌తో చెప్పి యియాలే స్ట్రైక్ చేయిస్తా. ఆఫీసు ప్యూన్లూ యూనియన్లే మెంబర్సే. లైటెనింగ్ స్ట్రైక్ చేస్తారు''.

నీవే యెల్లిపోవాల నీ కిక్కడ బాగా లేకపోతే. అసలెలా వచ్చావూ? నీలాంటి వారి పోకడలు తెలియని దాన్నిగాదు. నీ యియ్యపరాలూ దాని పెద్దకొడుకూ చేసిన నేరాలేనా, గోరాలేనా? నా అల్లుడు సిన్నోడై యుండి, ధైర్నంగా మిలట్రీలో కెల్లాడు. బాగా సంపాయించి మంచి మేడలో వుండాలని ఆడి కోరిక. పోరు తీవ్రమాయె. పట్టుబడినాడో బాంబుపడి సచ్చినాడో గూడా తెలియరాలేదు. ఆడు పంపిన డబ్బు పెట్టే పెద్దోడు మేడ లేవదీసినాడు. ఆవుల్నీ గేదెల్నీ కొని పాల యాపారం పెట్టాడు గానీ, తమ్ముడేమైందీ తెలియక వార్తలందక పోగానే అన్నీ బంద్ చేసి మాకు తెల్దు మాకు సెప్పనేదన్నారు తల్లీ కొడుకూ. కులపెద్దలను పోగుచేసి ఆరున్న వూరెల్లి మొత్తుకుంటే అలగా మడుసుల్లాగా దుమ్మెత్తిపోసి తరిమేసినారు. మడుసుల నైజం తెలియని అడివి మనిషి అల్లుడు బసవన్న. తనోళ్లంతా నీతీ ధర్మం గలిగిన వాళ్లని నమ్మి ఆరి పేర పెట్టాడు జీతం. ఒక్కసారే వచ్చి, ప్రమోషనిచ్చారని చెప్పి కొద్దిగా రొక్కం చేతులో పెట్టి యెల్లిపోనాడు. అదయిపోనాది. విధిలేక పనిలో కెల్లింది నా బిడ్డ. మేల తాలాలు లేకపోయిన కులపెద్దలెదుటే చేసినాను పెల్లి. భోజనాలూ పెట్టినాము''.

''ఆశ వదులుకున్నాము. కాని బక్క చిక్కి కొనూపిరితో వచ్చినాడు పెల్లాం దగ్గరికి. భగమంతడే ప్రాణాలతో పంపాడని సంతోషించినాము. కోలుకుని మరొక వుద్యోగం సంపాయించుకునేదాకా కాపాడాము. ఆడి మనుషుల పేరే యెత్తలేదు. బతికి బట్ట గట్టి, యిల్లూ పెల్లామూ పిల్లకాయలు సమర్చుకున్నాడు. మర్లా పరపతి సంపాయించాడు. యింగప్పుడు యెక్కడెక్కడి సుట్టాలూ రాసాగారు యిల్లు గుల్ల సేయటానికి. అల్లుడూ కూతురూ నోరు లేనోళ్లైపాయె. మెత్తనోళ్లని తెలిసి, ''జడ్జీబాబుతో సెప్పి, నౌకరీ యిప్పించు బసవా! డాక్టరుబాబుతో సెప్పి ఆపరేషన్ చేయించు బసవన్నా. సెల్లికి సంబంధం సూడు'' అని పన్లు పురమాయించారు.

అప్పటికైనా నా కూతురంటే లెక్కలేదు జమా లేదు. సూటి పోటి మాటలనటమే. నీ కూతురల్లే ''నువే వంటమనిషితో లాలూచీ అయి రావొద్దని చెప్పావు'' అనలేదు.

''నీ బొజ్జా, జబ్బలు సూస్తేనే నా యియ్యపరాలు గుర్తొచ్చింది నీవు వచ్చిననాడే. మంచానబడితే సేసేవోరు లేరీనాడు. మర్యాదిచ్చి మర్యాద పుచ్చుకోవాల. నీకు తెల్దా. హక్కుభుక్తాలున్నాయని కొడుకు సొమ్ము తినాలని వచ్చినావు. తినగలిగినంతటిని, తీసికెళ్ల గలిగినంత తీసికెళ్లు. నన్ను పంపేయలేవు. నమ్మకమైన మరో మనిషి కుదిరేప్పటికి నీ తాతలు దిగి రావాల. బాబుకి అమ్మకి తెలుసు'' అని వురిమి వెళ్లింది యాభై అయిదేళ్ల మంగ.

గాలివాన వెలిసినట్లయింది.

మెట్ల మీద నిలబడి, జముకుల కథ అభినయం పాటతో చెప్తుంటే విన్నట్టు విన్నాడు విశ్వం. మంగ చెప్పిన కథకీ తన కథకీ చాలా పోలికలున్నాయి. తేడా అల్లా నిలదొక్కుకోటానికి శ్రమించింది తానే. అర్థంగాని విషయం అర్థమయినట్టు చూశాడు విశ్వం.